

యాభై ఏళ్లుగా అద్దె..

పిట్లం సబ్ పోస్టాఫీస్ గత 50 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. కొన్నేళ్లుగా ఓ చోటు నుంచి మరో చోటుకు మారుతోంది.

- 9లో ▸



రాష్ట్రస్థాయి నెట్‌బాల్..

మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారులను జిర్కూర్‌లో ఎంపిక చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /20.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మబ్బులు కమ్ముకునే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యనందించాలి



కామారెడ్డి టౌన్: పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించేలా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రమణకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం (అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, ప్రగతిని తెలుసుకున్నారు. ఆవాస పాఠశాలలోని సరుకుల, వంటగదిని, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు మెరుగుపడాలని సూచించారు. ఆయన వెంట జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి నాగవేందర్ తదితరులు ఉన్నారు.

పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలి



కామారెడ్డి రూరల్: పత్తి రైతులు కనీస మద్దతు ధర రూ.8,110కి పంట దిగుబడిని విక్రయించుకోవాలనుకుంటే ముందస్తుగా సీసీఐ 'కపాస్ కిసాన్ యాప్'లో స్లాట్ బుక్ చేసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ హైదరాబాద్ సంయుక్త సంచాలకులు మల్లేశం సూచించారు. యాప్ ద్వారా నిర్ణీత తేదీ, సమయంలో సంబంధిత కాటన్ జిన్నింగ్ మిల్లుకి వెళ్లాలని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి విక్రయించే సందర్భంలో ఎదురయ్యే సమస్యలు, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 18005995779కి రైతులు కాల్ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వివరాలు, పత్తి అర్హత, అమ్మకాల వివరాలు, చెల్లింపుల వివరాలు తెలుసుకోవడానికి వాట్సాప్ చాట్ 8897281111 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి కనీస మద్దతు ధర లభించే విధంగా చూడాలని కోరారు. డీఏవో గోవింద్, ఏడీలు, ఏఈవోలు, ఏవోలు, మార్కెటింగ్ శాఖ డీఎంవో గంగు, రమ్య, సీసీఐ సీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం నిర్వహించిన ప్రత్యేక లక్కీ డ్రా విజేతలను సీపీ సాయిచైతన్య ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి బహుమతి చంద్రయ్య (రూ.25 వేలు), ద్వితీయ బహుమతి షేక్ బాబర్ (రూ.15వేలు), తృతీయ బహుమతి రాంప్రసాద్ (రూ.10 వేలు) అందజేశారు. ఆర్ఎం జ్యోత్స్న మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడి సహకారమే సంస్థ విజయానికి మూలాధారమన్నారు. డీఆర్ఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో వరదకు తెగిన దాసనమ్మ కుంట కట్టను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

క్షేత్రస్థాయి పరిశీలన..

నష్టం వివరాల సేకరణ

- జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం
- వరద మిగిల్చిన నష్టాన్ని పరిశీలించిన సభ్యులు
- జిల్లా కేంద్రంతోపాటు ఐదు మండలాల్లో పర్యటన
- కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్
- నష్టం వివరాలను బృందం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాను అతలాకుతలం చేసి వరద మిగిల్చిన నష్టాన్ని కేంద్ర బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ పీకే రాయ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం బుధవారం జిల్లాకు వచ్చింది. భిక్కనూర్ వద్ద కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వారికి ఘన స్వాగతం పలికారు. భిక్కనూరు, బీబీపేట మండలాల్లో పర్యటించిన అనంతరం కేంద్ర బృందం ప్రతినిధులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జీఆర్ కాలనీలో పర్యటించి వరదల కారణంగా ధ్వంసమైన రోడ్లు, దెబ్బతిన్న వంతెనలను పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్ వద్ద కాలువ, పంప్ హౌస్, కాజ్‌వే రోడ్డును పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించగా, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ ఏడాది ఆగస్టు 26వ తేదీ నుంచి 28 వరకు 3 రోజుల వ్యవధిలోనే ఏడాది కాలంలో కురిసే సగటు వర్షపాతం (983.4)లో 40 శాతం (339.8 ఎంఎం) కురిసిందన్నారు. జిల్లాలోని రహదారులు, వంతెనలు, పంటలు, చెరువులు, కుంటలు, విద్యుత్ సౌకర్యాలు, ఇళ్లు దెబ్బతినగా, తాత్కాలికంగా అత్యవసర పునరుద్ధరణ పనులు చేపట్టామని కలెక్టర్ వివరించారు. బృందంలో ఎక్స్పెండీచర్స్ సెంట్రల్ ఫైనాన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి అధికారి శ్రీనివాస్ బైరి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారి శశివర్ధన్‌రెడ్డి ఉన్నారు.



వరద నష్టంపై కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మండలాల్లో పర్యటన సాగిందిలా..

భిక్కనూరు/ బీబీపేట/ఎల్లారెడ్డి/లింగంపేట/నాగిరెడ్డిపేట: భిక్కనూరు మండల కేంద్రంలోని దాసనమ్మ చెరుకు కుంట, అంతంపల్లి రోడ్డుతోపాటు దెబ్బతిన్న పంటలను, ఎడ్లకట్ట వాగును కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. బీబీపేట ప్రధాన రోడ్డులో ఉన్న బ్రిడ్జితోపాటు దెబ్బతిన్న విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు నష్టం వివరాలను బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఎల్లారెడ్డి మండలం అడవిలింగాల గేట్ వద్ద కోతకు గురైన రోడ్డు, పెద్ద చెరువు కట్ట కింది భాగంలో పంటపొలాల్లో ఇసుక మేటలు వేసిన ప్రదేశాలను పరిశీలించారు. లింగంపేట మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో కొట్టుకుపోయిన పాముల వాగు వంతెనను, పంటపొలాల్లో వేసిన ఇసుక మేటలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని బృందం పరిశీలించింది. ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బృందం వెంట కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఏవో మోహన్‌రెడ్డి, భిక్కనూరులో ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఆర్ఐ బాలయ్య, బీబీపేటలో తహసీల్దార్ గంగసాగర్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఆర్ఐ రాము, విద్యుత్ శాఖ ఏఈ విజయభాస్కర్, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్, ఏడీఏ సుధామాధురి, ఆర్అండ్‌బీ ఈఈ మోహన్, డీఈ నారాయణ, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో లలితకుమారి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

చేతికొస్తున్న ధాన్యం

- జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఇప్పటికే పలు చోట్ల ప్రారంభమైన సేకరణ
- ఆందోళన కలిగిస్తున్న వర్షాలు



నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి శివారులో ధాన్యాన్ని కుప్ప పోస్తున్న యంత్రం

కామారెడ్డి క్రైం: జిల్లాలో వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలుకాగా అధికారులు ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం ధాన్యం సేకరణ ప్రారంభ దశలో ఉండగా.. ఈ సారి 4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి కేంద్రాలకు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే రైతులను వరుణుడు ఆందోళనకు గురి చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అంచనా కన్నా తక్కువ ధాన్యం కేంద్రాలకు వచ్చేలా కనిపిస్తోంది. మరో వైపు కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

గత కొన్ని సీజన్‌లుగా ధాన్యం సేకరణలో నిజామాబాద్ తర్వాత కామారెడ్డి జిల్లా ఉంది. సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజుల క్రితమే జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటిలాగే గుర్తించిన అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మొత్తం 427 కేంద్రాలను ప్రారంభించగా వాటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 233, ఐకేపీ ఆధ్వర్యంలో 194 కేంద్రాలున్నాయి. గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి 351 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముందుగా భావించారు. కానీ ఆయా ప్రాంతాల నుంచి రైతులు కోరడంతో మొత్తం 424 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో 3.14 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా.. 4.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రావొచ్చని అంచనా వేశారు. కానీ 4.31 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. అప్పటికీ ధాన్యం సేకరణలో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ సారి జిల్లాలో 3.18 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 5.90 లక్షల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. రైతుల ఇంటి అవసరాలు పోను మిగితాది కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అన్ని కేంద్రాలను ప్రారంభించాం

జిల్లాలో 427 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నింటినీ వారం రోజుల క్రితమే ప్రారంభించాం. ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా కొనుగోళ్ల ప్రక్రియ జరిగేలా రకాల చర్యలు తీసుకుంటున్నాం. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలి.

– శ్రీకాంత్, డీఎం, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్

నిబంధనలతో రైతులకు తిప్పలు

గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే రైతులు ముందుగా ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం 17కి మించకుండా కేంద్రాలకు తీసుకు రావాల్సి ఉంటుంది. ఈ నిబంధన ప్రస్తుత సీజన్‌లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇప్పటికీ వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టే అవకాశం దొరకడం లేదు. వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉంటాయి. దీంతో రైతులు తక్కువ ధరకైనా సరే కల్లాల్లో నుంచే కొనుగోలు చేసే దళారుల వైపు మొగ్గుచూపిస్తున్నట్లు తెలుస్తోంది. వరుణుడు దయ చూపిస్తేనే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా సాగనుంది. ప్రతిసారి బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్ మండలాల పరిధిలో ముందుగా ధాన్యం సేకరణ ప్రారంభమవుతుంది. అధికారులు మాత్రం కేంద్రాలన్నీ ప్రారంభించి సిద్ధంగా ఉన్నారు. యంత్ర పరికరాలు, గన్నీ సంచుల తరలింపు, రవాణా, తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెబుతున్నారు. వానలు ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ఏ మేరకు ధాన్యం సేకరణ జరుతుందో చూడాలి మరి.

వైన్ షాపులకు 57 దరఖాస్తులు

కామారెడ్డి రూరల్: జిల్లాలోని మద్యం దుకాణాలకు బుధవారం వరకు 57 దరఖాస్తులు అందినట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను బుధవారం డీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 49 దుకాణాలు ఉండగా కొత్త టెండర్ల ప్రక్రియను ఇటీవలే ప్రారంభించామన్నారు. వాటిలో 5 ఎస్సీ, 2 ఎస్టీ, 7 గౌడ సామాజిక వర్గాలకు కేటాయించడం జరిగిందని వివరించారు. ఓపెన్ కేటగిరి కింద 35 దుకాణాలు ఉండగా ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, 23వ తేదీన లక్కీ డ్రా ఉంటుందన్నారు. బుధవారం నాడు అందిన 12 దరఖాస్తులతో కలిపి ఇప్పటి వరకు మొత్తం 57 దరఖాస్తులు అందాయన్నారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 12, దోమకొండ స్టేషన్ పరిధిలో 6, ఎల్లారెడ్డి పరిధిలో 3, బాన్సువాడ పరిధిలో 15, బిచ్కుంద పరిధిలో 21 దరఖాస్తులు అందాయని వివరించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ఎలక్షన్ కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల అధికారిణి రాణి కుముదిని
- నామినేషన్‌ల స్వీకరణ ఏర్పాట్లపై సూచనలు

కామారెడ్డి క్రైం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని(కోడ్) పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారిణి రాణి కుముదిని సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా మాట్లాడారు. అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు. సున్నిత ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో భాగంగా 14 జెడ్పీటీసీ, 136 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, డీఆర్వో మధుమోహన్, డీపీవో మురళి, శిక్షణ కలెక్టర్ రవితేజ, అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, అధికారులు

ఆదర్శం 5.30 బ్యాచ్

రామారెడ్డిలో మూడేళ్ల క్రితం ఏర్పాటు

- ఆరోగ్య సంరక్షణ.. సమాజ సేవే లక్ష్యం
- ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న బ్యాచ్ సభ్యులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఆరోగ్య సంరక్షణ ఎంత ముఖ్యమో సామాజిక సేవ సైతం అంతే ముఖ్యమని అంటున్నారు రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన '5.30 బ్యాచ్' సభ్యులు. ప్రతి రోజూ తెల్లవారుజామునే వాకింగ్, వ్యాయామం చేసే వారంతా కలిసి 5.30 బ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. రామారెడ్డి మైదానంలో ఆరుగురు యువకులు మూడేళ్ల క్రితం 5:30 బ్యాచ్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు.

బ్యాచ్ ముఖ్య ఉద్దేశం ఆరోగ్యమే మహాభాగ్యం. ఇద్దరితో మొదలైన బ్యాచ్ 120 మందికి చేరింది. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు రామారెడ్డి మైదానానికి గ్రూప్‌లోని యువకులతోపాటు 60 ఏళ్లు పైబడిన వృద్ధులు కూడా చేరుకుని వ్యాయామం చేస్తారు.

సమాజ సేవ

5:30 బ్యాచ్ ఆధ్వర్యంలో ఆరోగ్యమే మహాభాగ్యమంటూనే సమాజ సేవలోనూ పాలుపంచుకుంటున్నారు. స్వచ్ఛభారత్‌ను ముందుకు తీసుకెళ్లి మైదానంలో అపరిశుభ్రత ఎక్కడున్న శుభ్రపర్చడం. శుభ్రపరచిన చోట మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం వారి పని. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తలాకొంత డబ్బులు పోగుచేసి అండగా నిలుస్తున్నారు. ఇటీవల వరద బాధితులకు జూనియర్ కళాశాలలో ఆశ్రయమివ్వగా.. వారికి ఓ పూట టిఫిన్, రెండు పూటలా భోజనం మూడు రోజులపాటు సమకూర్చారు. రామారెడ్డి గ్రామం అంటేనే క్రీడా గ్రామంగా పేరుంది. క్రీడాకారులకు క్రీడాదుస్తులు, అవసరమైన సామగ్రి అందించే బాధ్యతనూ 5.30 బ్యాచ్ తీసుకుంది. అలాగే క్రీడల్లో రాణిస్తున్న వారికి నగదు సాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. మా ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూనే సమాజానికి తమవంతు సేవ చేస్తున్నామని, మాతో కలిసి రావాలని పిలుపునిస్తున్నారు 5.30 బ్యాచ్ సభ్యులు.



వరద బాధితుల కోసం భోజనాన్ని సిద్ధం చేస్తున్న బ్యాచ్ సభ్యులు (ఫైల్)

ఆరోగ్యం.. సేవాభావం



ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో మూడేళ్ల క్రితం 5:30 బ్యాచ్‌ను స్థాపించాం. వ్యాయామం చేయడంతోపాటు సమాజసేవ చేస్తున్నాం. 120 మంది సభ్యులు ఉన్నారు. తెల్లవారుజామునే గ్రౌండ్‌కు చేరుకుంటాం.

– గురిజకుంట స్వామి

రెండేళ్లుగా వస్తున్నా..



నేటి కాలంలో ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు. అదే ఉద్దేశంతో 5:30 బ్యాచ్‌ను ప్రారంభించి నడిపిస్తున్నందుకు అభినందనీయం. రెండేళ్లుగా ప్రతిరోజూ వచ్చి వ్యాయామం చేస్తున్నా. సభ్యులందరం కలిసి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నాం.

– సామల రాజేశ్వర్

ప్రతిరోజూ వస్తాను



నాకు 63 ఏళ్లు. ప్రతి రోజూ గ్రౌండ్‌కి వస్తాను. వ్యాయామంతోపాటు మైదానం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయడం, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ఆనందంగా ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు సమాజ సేవకు మరింత మంది కలిసి రావాలి.

– శివారాం రాజనర్సాగౌడ్

మానవ అక్రమ రవాణ నిర్మూలన అందరి బాధ్యత

కామారెడ్డి రూరల్: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు అయినప్పుడే దానిని సమూలంగా నివారించొచ్చని డీఈవో రాజు అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో టీక్రియాల్ కేజీబీవీలో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం నాటి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని అన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్స్ లో అవగాహనా కల్పించాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్యఅని, ఫోన్ ఉపయోగించడం ద్వారా కలిగే అనర్థాలను పిల్లలకు వివరించాలన్నారు. ప్రజ్వల, ఫౌండేషన్ రీసోర్స్ పర్సన్లు సంజీవులు, రాములు మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 32,000 వేల మంది అమ్మాయిలను, మహిళలను కాపాడామన్నారు. ఎంఈవో ఎల్లయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయకులు, సీఆర్‌పీలు చిరంజీవి, రాములు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

క్లుప్తంగా

భాగ్‌చంద్ బాబా సంగత్ మహోత్సవ ర్యాలీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): భాగ్ చంద్ బాబా సంగత్ మహోత్సవంలో భాగంగా బుధవారం పెద్ద కొడప్‌గల్ నుంచి పెద్ద దేవిసింగ్ తండా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పెద్దలు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే భాగ్‌చంద్ బాబా సంగత్(బండారా) మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. తండాలో లంబడా వేషధారణలో నృత్య ప్రదర్శనలు చేసి అందరిని ఆకట్టుకున్నారు.

సీజేపై దాడిచేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలి

మాచారెడ్డి: సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడి చేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం పాల్వంచ మండల ఉపాధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పాల్వంచలో మాట్లాడారు. నేతలు నర్సింలు, ఎల్లం, రాకేష్, సచిన్‌లు ఉన్నారు.

బాన్సువాడ: సుప్రీం సీజేపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. బుధవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులు బంగారు మైశయ్య, ప్రశాంత్, నర్సింలు, గైని రవి, మల్లూరి సాయిలు, సాయిలు, రాజు, గంగాధర్ వినోద్, నక్క విజయ్, తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిర్మన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి ఇంతియాజుద్దిన్ సూచించారు. బుధవారం తిర్మన్‌పల్లిలోని అన్ని వీధుల్లో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయించారు. వీధుల్లో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగింపజేయించారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే ట్రాక్టర్‌లో వేయాలన్నారు. కారోబార్ బాల్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ పండుగ



బాన్సువాడ రూరల్: పోచారం గ్రామంలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ చెరువు కట్టపై గంగమ్మ గుడి కట్టి 5 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామం నుంచి బాజాభజంత్రీలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. గ్రామపెద్దలు పోచారం శంభురెడ్డి–ప్రమీలా దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా కార్తీక మాస భజనలు ప్రారంభం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం వేకువజామున కార్తీకమాస భజనలు వైభవంగా మొదలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన సుమారు 50 మంది భక్తులు ఉదయం 5 గంటల నుంచి గంటన్నర పాటు మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో తిరుగుతు భక్తి పాటలు పాడుతు, భజనలు చేస్తు అర్చకులు శంఖం పూరిస్తూ దైవచింతన చేస్తున్నారు. మండల కేంద్రంలోని అన్ని ఆలయాలకు వెళ్లి హారతి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కార్తీక మాసం ముగింపు వరకు భజనలు కొనసాగిస్తామని వారు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Required Marketing Executives (P.R.O.) for Geetha Jr. College - Toopran. Freshers/Experienced. Cont : T. Raju : 94407 61962, B.Raju : 93948 65402, K. Mahesh : 95158 53504.
[SCA25008774]

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931
[HA-16191]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రుణ పంపిణీ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- గైర్హాజరైన బ్యాంకర్ల తీరుపై అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు, రైస్‌మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు గురించి ఆరా తీశారు. ఈ సమావేశానికి పలువురు బ్యాంకర్లు గైర్హాజరు కావడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కీలక సమావేశానికి బ్యాంకర్లు రానప్పుడు, సమావేశం నిర్వహించి ప్రయోజనం ఏమిటని సంబంధిత అధికారులను నిలదీశారు. గైర్హాజరైన బ్యాంకర్ల గురించి మినిట్స్ బుక్‌లో పొందుపరిచి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు.

మిల్లర్లకు గ్యారెంటీలను మంజూరు చేయాలి

జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంట రుణాల లక్ష్యాన్ని అధిగమించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అర్హత కలిగిన రైస్ మిల్లర్లకు వెంటదివెంట బ్యాంకు గ్యారెంటీలను మంజూరు చేయాలని సూచించారు. కొత్త రైస్‌మిల్లర్లకు సైతం ప్రాపర్టీ మార్ట్‌గేజ్ చేసుకొని బ్యాంక్ గ్యారెంటీ అందించాలని అన్నారు. వ్యవసాయ శాఖతోపాటు డీఆర్డీఏ, మెప్మా, పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, డీఆర్డీవో సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్, ఆర్బీఐ ఎల్‌డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

స.హ. చట్టం అమలులో ఆదర్శంగా నిలవాలి

- దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖలలో సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఆర్‌టీఐ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోల నేతృత్వంలో గురువారం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లలో డివిజనల్ స్థాయిలో, శుక్రవారం తహసీల్దార్ల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆయా శాఖల పీఐవోలు, ఏపీఐవోలు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి (పీఐవో), సహాయ పౌర సమాచార అధికారి (ఏపీఐవో), అప్పిలేట్ అధికారి వివరాలతో కూడిన సమాచార హక్కు చట్టం బోర్డును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆర్‌టీఐ అమలుకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్ ను నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను పొందుపరచాలని సూచించారు. 4(1బి) రిజిస్టర్లోని సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అన్ని కార్యాలయాలలో అందుబాటులో ఉంచాలని, పీరియాడికల్ రిపోర్ట్స్‌ను క్రమం తప్పకుండా సేకరించాలని, కనీసం మూడు మాసాలకు ఒకసారి ఆర్‌టీఐ అమలుపై సమీక్ష జరపాలన్నారు. దరఖాస్తుదారు రెండవ అప్పిలేట్ అథారిటీకి వెళ్లే ఆస్కారం లేకుండా కోరిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో అందించాలన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో అనవసర కాలయాపన చేస్తే జరిమానాలకు గురి కావాల్సి వస్తుందని, ఇది పదోన్నతులు, ఇంక్రిమెంట్లు వంటి వాటిపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందన్నారు. రిసోర్స్ పర్సన్లు కిషన్, కృష్ణాజీ సమాచార హక్కు చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అకడమిక్ వాతావరణం నెలకొల్పాలి

- బయోమెట్రిక్ హాజరు అమలు
- వీసీ ప్రొఫెసర్ యాదగిరి



మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో అకడమిక్ వాతావరణం నెలకొల్పడానికి అన్ని విభాగాల అధిపతులు కృషి చేయాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరిరావు సూచించారు. తన చాంబర్‌లో బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో కలిసి అని విభాగాల అధిపతులతో వీసీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు వర్సిటీలో బయోమెట్రిక్ హాజరువిధానాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కళాశాలల్లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులకు పకడ్బందీగా తరగతులు నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో పరీక్షలు వాయిదా వేయొద్దని, సమయానికి ఇంటర్నల్ ఎగ్జామ్స్, ప్రాక్టికల్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్ గౌడ్, బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ సాయిలు, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్, ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ రాంబాబు, ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, జెట్లింగ్ ఎల్లోసా, సమత, ప్రసన్న, సత్యనారాయణ రెడ్డి, నీలిమా, లక్షణ చక్రవర్తి, పాత నాగరాజు, పీఆర్‌వో పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట.. ప్రాణాలతో ఆట



గోదావరిలో వరద గేట్ల వైపు తెప్పలపై వెళ్తున్న జాలర్లు

బాల్కొండ: మత్స్యకారుల అనాలోచిత చర్యలతో ప్రాణాలు పోతున్న తీరు కలవరానికి గురిచేస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ఎదుట గోదావరిలో జాలర్లు ప్రాణాలు పోతున్నా వేట మానడం లేదు. గత శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు గేట్ల ఎదుట చేపల వేటకు వెళ్లి గోదావరిలో గల్లంతయ్యారు. అందులో ఒకరు ప్రాణాలతో బయటపడగా మరొకరు నీటమునిగి కొట్టుకుపోయారు. ఈ ఘటన జరిగి వారం గడవకముందే మళ్లీ వరద గేట్ల ఎదుట గోదావరిలో బుధవారం జాలర్లు వేట సాగించారు. ఉదయం 9 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా ప్రవాహంలోనే చేపల వేట కొనసాగించారు. వరద గేట్ల ఎదుట చేపలు వేటాడకుండా ఎవరూ చర్యలు చేపట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వరద గేట్ల ఎదుట ప్రవాహం సమయంలో చేపలవేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఏఎస్‌సీఐ



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రమీదరెడ్డితో మాట్లాడుతున్న ఏఎస్‌సీఐ వైద్య బృందం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) వైద్య బృందం బుధవారం సందర్శించింది. వైద్యులు హరికృష్ణ, రేష్మతోపాటు బృందం సభ్యులు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, పరికరాలు, స్టాఫ్ హాజరు, శుభ్రత, రోగుల క్షేమం తదితర వాటి వివరాలను సేకరించారు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, ఇతర సౌకర్యాలపై సూపరింటెండెంట్ ప్రమీదరెడ్డిను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి మెరుగుదల కోసం సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్ర ఆరోగ్య శాఖకు అందజేస్తామని బృందం సభ్యులు తెలిపారు. వారి వెంట వైద్యులు అమృత్‌రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, అజయ్ తదితరులు ఉన్నారు.

'స్థానిక' ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈసీ నిబంధనలు పాటించాలి
- సీపీ సాయిచైతన్య ఆదేశం



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై బుధవారం పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణమే కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. గత ఎన్నికల ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నేరస్థులు, రౌడీ షీటర్లను రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు.

రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్లొద్దు..

సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లరాదని ప్రజలకు సూచించారు. ఈ నిబంధన ఉల్లంఘిస్తే నగదు మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ సాయిచైతన్య పోలీసులను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెల్ సీఐ వీరయ్య, సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు

సేటు చెప్పిందే రేటు..

- ప్రారంభం కాని మక్కల కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్న రైతులు
- లాభపడుతున్న దళారులు



వెల్మల్ గ్రామ సమీపంలో మక్కలను ఆరబెడుతున్న మహిళా రైతు



వెల్మల్‌లో ఎండబెట్టిన కంకులు

నందిపేట్(ఆర్మూర్): మొక్కజొన్న పంట చేతికొచ్చినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఒకపక్క వర్షం మరోపక్క రోజురోజుకు తగ్గుతున్న ధరలతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకే మక్కలను అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 52,093 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఇప్పటికే అన్నిచోట్లా మక్క కోతలు ప్రారంభమయ్యాయి. అయితే, కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మక్కలను ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యాపారుల మాయ..

ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంటను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లే స్తోమత లేకపోవడంతో స్థానిక వ్యాపారులకే విక్రయిస్తున్నారు. అయితే, రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ధరలను అమాంతం తగ్గిస్తున్నారు. 20 రోజుల కిందట క్వింటాలుకు రూ.2,500 చెల్లించి కొన్న వ్యాపారులు ప్రస్తుతం రూ.1900కే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా మద్దతు ధరను మించి అమ్ముడైన పంట ఈసారి తక్కువ ధర పలుకుతోంది. వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ. 500 వరకు తగ్గడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేనాటికి తమ పంట దళారులకు చేరుతుందని వాపోతున్నారు.

తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం



మక్క పంటను అమ్ముకుందామంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. రోజు వర్షం పడడంతో మక్కలను ఆరబెట్టడం కష్టమవుతోంది. ఇదే అదనుగా చేసుకొని దళారులు తక్కువ ధరకు కొంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక దళారులకు అమ్ముకుంటున్నాం.

– అల్లెం గంగనర్సు, మహిళా రైతు,వెల్మల్ గ్రామం,

కేంద్రాలను ఏర్పాటు చేయాలి



మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. కొన్ని రోజులుగా వర్షాల పడడంతో కష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ఇవ్వాలి.

– కుర్మె ధర్మన్న, వెల్మల్ గ్రామం

ప్రతిపాదనలు పంపించాం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. – రంజిత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం, నిజామాబాద్

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామశివారులో బుధవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.7,950 నగదు, మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాలలో ఎక్కడైనా పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రైం కార్నర్


అడవిపంది దాడిలో మహిళకు గాయాలు



గాయపడిన ఏసవ్వ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సత్యంగారి ఏసవ్వపై అడవిపంది దాడి చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. ఏసవ్వ పొలానికి వెళ్తున్న సమయంలో అడవిపంది దాడి చేసింది. దీంతో ఆమె కాలు విరిగింది. గాయపడిన ఏసవ్వను ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు కామారెడ్డికి రిఫర్ చేశారు.

ఇసుక వాహనం సీజ్



దోంగ్లీ వద్ద పట్టుకున్న ఇసుక వాహనం

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లా సమీపంలో ప్రభుత్వ ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని బుధవారం ఉదయం పట్టుకున్నట్లు డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇసుక అక్రమ తరలింపుపై తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రభుత్వ క్వారీ వద్ద ఉన్న ఇసుక కుప్పల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను డంప్ చేసుకొని వెళ్తుండగా డోంగ్లీలో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని డోంగ్లీ తహసీల్ కార్యాలయానికి తరలించామని తెలిపారు.

ఆనకట్టపై మక్కల ఆరబోత



ఎస్సారెస్పీ ఆనకట్టపై ఆరబెట్టిన మక్కలు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి పండించిన మక్క పంటల ఆరబోత రైతులకు ఇబ్బందికరమవుతోంది. నూర్పిళ్ల అనంతరం వర్షాలు వెంటాడుతుండటంతో మక్కలను ఆరబెట్టేందుకు కల్లాలు, రోడ్లు సరిపోవడం లేదు. దీంతో రైతులు ఎస్సారెస్పీ ఆనకట్టను ఆశ్రయిస్తున్నారు. ముప్కాల్, నల్లూర్, కొత్తపల్లి, బస్సాపూర్, సోన్‌పేట్ తదితర గ్రామాలకు చెందిన రైతులు మక్కలను ఆరబెట్టేందుకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆనకట్ట వరకు తరలిస్తున్నారు. అయితే, మక్కల ఆరబోతతో పర్యాటకులకు కొంత మేర ఇబ్బంది కలిగినా అన్నదాతల అవస్థలను దృష్టిలో ఉంచుకొని సర్దుకుపోతున్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి



వేల్పూర్ కేసీఆర్ కాలనీవాసులకు కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, బాకీ ఉన్న హామీలను కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ప్రజలందరికీ చేరవేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేల్పూర్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో బుధవారం ఆయన కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేస్తే ఆ ఓట్లు మురిగిపోతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలు పడితే అంతే సంగతి!



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలలో డ్రెయినేజీ నీటితో ఏర్పడిన లోతైన కందకం ప్రమాదకరంగా మారింది. పిల్లలు ఆడుకుంటూ అటువైపు అనుకోకుండా వెళ్లి జారి పడితే ప్రాణాలు పోయే ప్రమాదముంది. కందకాన్ని పూడ్చేయాలని చాలా సార్లు అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. – డొంకేశ్వర్(ఆర్మూర్)